నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

గురువారం | డిసెంబర్ 26, 2024 | www.navatelangana.com

మూడో రోజూ కొనసాగిన రైతు దీక్ష

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

తన భూమి తనకు ఇప్పించాలని కోరుతూ రైతు జాదవ్ మోతీరాం కలెక్టరేట్ ఎదుట ప్రారంభించిన రిలే నిరాహార దీక్ష బుధవారం మూడవ రోజుకు చేరింది. దీక్షలో బాధిత రైతుతో పాటు భార్య పీరుబాయి పాల్గొంది. వ్యవసాయ కార్మిక సంఘం నిర్మల్ మండల అధ్యక్షులు బరుకుంట గంగారాం దీక్షకు మద్దతు తెలిపారు.



ఘన్‌పూర్‌లో హైమాస్ట్ లైట్లు ప్రారంభం

నవతెలంగాణ-బోథ్

మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో బుధవారం మూడు హైమాస్ట్ లైట్లను గ్రామ పెద్దలు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గ్రామంలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసి హామీ నిలబెట్టుకున్నారన్నారు. దీనికి గ్రామస్తులు ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు నారాయణ, భగవాన్, దాస్, వెంకట్‌రాం, గులాబ్‌సింగ్, సుదర్శన్, హరి, రఘునాథ్, సుభాష్ పాల్గొన్నారు.



యథేచ్ఛగా జీరో దందా..!

- లైసెన్సు లేకుండా విచ్చలవిడిగా వెలిసిన దుకాణాలు
- మారుమూల ప్రాంతాలకు విస్తరించిన పత్తి వ్యాపారం
- తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువకు విక్రయం
- మార్కెట్ ఫీజుతో పాటు భారీగా నష్టపోతున్న అన్నదాతలు

అక్రమమని తెలిసినా పట్టించుకోని అధికారులు

జిల్లాలో జీరో వ్యాపారం జోరుగా సాగుతోంది. ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోకుండా..లైసెన్సు లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్నారు. రైతుల అమాయకత్వం..అవసరాలను ఆసరాగా తీసుకుంటున్న కొందరు మధ్య దళారులు అందినకాడికి దండుకుంటున్నారు. ఇది వరకు జిల్లా కేంద్రానికే పరిమితమైన ఈ వ్యాపారం..ప్రస్తుతం మండల కేంద్రాలతో పాటు మారుమూల ప్రాంతాలకు సైతం విస్తరించింది. మార్కెట్‌కు పత్తి రాకపోవడంతో మార్కెట్ ఫీజును భారీగా కోల్పోవాల్సి వస్తోంది. వీటితో పాటు తక్కువ ధరకు విక్రయించాల్సి రావడంతో అన్నదాతలు సైతం తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. ఇలాంటి వ్యాపారం అక్రమమని తెలిసినా అడ్డుకోవాల్సిన మార్కెట్ అధికారులు మామూలుగా తీసుకుంటూ వదిలేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అధికారులు ఎవరూ ఏమీ చేయలేరనే ధీమాతో మరిన్ని దుకాణాలు వెలుస్తున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



నార్నూర్ మండల కేంద్రంలో పత్తి కొంటున్న వ్యాపారి

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి


ఆదిలాబాద్ జిల్లాలో జీరో వ్యాపారానికి హద్దులేకుండా పోతోంది. కొన్నేండ్ల నుంచి ఈ దందా విచ్చలవిడిగా సాగుతున్నా అధికారులు అడ్డుకట్ట వేయడం లేదు. కొందరు ప్రభుత్వం నుంచి లైసెన్సు తీసుకొని వ్యాపారం నిర్వహిస్తుండగా.. అనేక మంది ఎలాంటి అనుమతులు లేకుండానే దందా సాగిస్తున్నారు. అధికారులను మచ్చిక చేసుకొని ఈ దందా సాగిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రస్తుతం ఆదిలాబాద్ చుట్టుపక్కల నలువైపులా పదుల సంఖ్యలో దుకాణాలు వెలిశాయి. ఈ వ్యాపారం జిల్లా కేంద్రానికే పరిమితం కాకుండా మండల కేంద్రాలు, మారుమూల ప్రాంతాలకు సైతం విస్తరించింది. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాల్ పత్తికి రూ.7521 ధర ఉండగా.. వీరు కేవలం క్వింటాల్‌కు రూ.6600 చొప్పున మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. రైతులు ఆయా ప్రాంతాల నుంచి మార్కెట్‌కు తీసుకురావాంటే వాహనం ఛార్జీలు అధికమయ్యే పరిస్థితి ఉండటం, పంటల నమోదులోనూ పేర్లు లేకపోవడం వంటి కారణాలతో అక్కడే తక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. మరోపక్క కొందరు కౌలు రైతులు, పోడు వ్యవసాయం చేసుకునేవారికి పట్టాలు లేకపోవడంతో సీసీఐకి విక్రయించలేని పరిస్థితి ఉంది. ఇలాంటి అనేక మంది రైతులు స్థానికంగానే విక్రయిస్తూ నష్టపోతున్నారు. ఒక్కో రైతు క్వింటాల్‌కు ఏకంగా రూ.700 నుంచి రూ.900వరకు నష్టపోవాల్సి వస్తోంది. ఇదే పత్తిని కొనుగోలు చేస్తున్న వ్యాపారులు మాత్రం రైతుల పేరిట మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ వ్యాపారం మూడు పువ్వులు..ఆరు కాయలుగా విరజిల్లుతుండటంతో అనేక మంది దుకాణాలు తెరుస్తూ ఈ వ్యాపారంలోకి దిగుతున్నారనే ప్రచారం జరుగుతోంది. గతంలో లైసెన్సు లేని వ్యాపారులకు తాఖీదులు జారీ చేసిన అధికారులు అడపాదడప కొన్నింటిపై చర్యలు తీసుకుంటూ మమ అనిపిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

మార్కెట్ ఆదాయానికి గండి..!

జిల్లాలో పండించిన పత్తి పంట మార్కెట్‌కు రాకపోవడంతో మార్కెట్ సెస్ కోల్పోవాల్సి వస్తోంది. ఫలితంగా మార్కెట్ ఆదాయం భారీగా నష్టపోవాల్సి వస్తోంది. ప్రభుత్వం జిల్లా కేంద్రంతో పాటు 11చోట్ల మార్కెట్లు ప్రారంభించినప్పటికీ అనేక మంది రైతులు పత్తిని మార్కెట్‌కు తీసుకురావడం లేదు. ప్రస్తుతం పత్తి వ్యాపారం మండల కేంద్రాలతో పాటు మారుమూల పల్లెల్లోనూ విస్తరించడంతో అక్కడే విక్రయిస్తున్నారు. తక్కువ ధరకు విక్రయిస్తూ రైతులు నష్టపోతుంటే.. అదే పత్తిని మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్న దళారులు ప్రయోజనం పొందుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మరోపక్క పల్లెల నుంచి పత్తి తమ దుకాణాలకే తీసుకొచ్చేందుకు ప్రయివేటు వాహనదారులతోనూ ఒప్పందం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇలా పత్తిని తీసుకొచ్చిన వాహనదారులకు ఎంతో కొంత కమీషన్ సైతం ఇస్తున్నట్లు ఆరోపణలున్నాయి. మరికొన్ని చోట్ల తూకాల్లోనూ మోసాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అనుమతిలేని దుకాణాలతో పాటు కొనుగోళ్లను అడ్డుకోవాల్సిన అధికారులు అంతగా దృష్టిసారించకపోవడంతో ఈ దందా మరింత విస్తరించేందుకు కారణమవుతోందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి : సంగెపు బొర్రన్న, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు



జిల్లాలో అనుమతి లేకుండా పత్తి వ్యాపారం కోసం వివిధ చోట్ల దుకాణాలు వెలిశాయి. రైతుల వద్ద నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేయడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కేంద్రప్రభుత్వం స్పష్టం చేసింది. అధికారులు ఇలాంటి మోసాలపై దృష్టిసారించి రైతులకు న్యాయం చేయాలి. మార్కెట్ ఆదాయానికి గండిపడకుండా చూడాలి.

లైసెన్సు లేనివాటిపై చర్యలు తీసుకుంటున్నాం : గజానన్, మార్కెటింగ్ ఏడీ, ఆదిలాబాద్

జిల్లాలో లైసెన్సు లేకుండా పత్తి వ్యాపారం నిర్వహిస్తున్న దుకాణాలపై ఇప్పటికే చర్యలు తీసుకుంటున్నాం. కొన్నిచోట్ల కాంటాలు సీజ్ చేసి బాధ్యులపై జరిమానా విధించాం. ఇక ముందు కూడా ఎవరైన లైసెన్సు లేకుండా వ్యాపారం నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

వేసవి విద్యుత్ డిమాండ్‌కు సిద్ధం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



రానున్న వేసవి కాలానికి విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా నిర్దిష్టమైన చర్యలు తీసుకుంటామని ఆసిఫాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శేషారావు తెలిపారు. గత వేసవిలో ఉన్న డిమాండ్‌ను ఆధారంగా చేసుకుని అదనపు డిమాండ్‌కు అనుగుణంగా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. నాలుగు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు పెంచడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. జిల్లాలో కొనసాగుతున్న సబ్‌స్టేషన్‌ల నిర్మాణ పనులను ఫిబ్రవరి కల్లా పూర్తి చేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ భారానికి అనుగుణంగా 120 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కెరమెరి, దహెగాం, కౌటాల, సిర్పూర్(టి) మండలాల్లో కెపాసిటర్ బ్యాంక్స్ అమర్చామని, 11కెవి ముత్యంపేట ఫీడర్‌లో లైన్ కెపాసిటర్స్ బిగించామని తెలిపారు. దీని వల్ల అధికలోడు తలెత్తినప్పుడు లోవోల్టేజ్ సమస్య తీరుతుందన్నారు. గడచిన కాలానికి జరిగిన అంతరాయాలు(బ్రేక్ డౌన్) సాంకేతికంగా విశ్లేషించి, వాటి ఆధారంగా బ్రేక్‌డౌన్ రెక్టిఫికేషన్ టీంలను నియమిస్తున్నామని వివరించారు. అత్యవసర సర్వీసులో భాగమైన ఆసుపత్రి, మెడికల్ కాలేజీలు, పోలీస్‌స్టేషన్లకు అత్యవసర పరిస్థితుల్లో, ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత వేసవిలో ఎదుర్కొన్న ఇబ్బందులను పరిగణలోకి తీసుకొని వచ్చే వేసవిలో వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి నిబద్ధతతో పని చేస్తున్నామని తెలిపారు.

27న టీయూసీఐ జిల్లా ఏడో మహాసభలను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

డిసెంబర్ 27న మధ్యాహ్నం 12గంటలకు పట్టణంలోని టీఎన్జీవో భవన్‌లో జరిగే సెంట్రల్ ట్రేడ్ యూనియన్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ) జిల్లా ఏడో మహాసభలను విజయవంతం చేయాలని టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న అన్నారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మహాసభల్లో ముఖ్యవక్తగా టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. అన్ని రంగాల కార్మికుల హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎం.బక్కన్న, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.గంగన్న. జిల్లా నాయకురాలు కె.లక్ష్మి, గంగామణి, రేష్మ, దేవక్క, భీమవ్వ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-బోథ్

మండలంలోని కౌట(బి) గ్రామానికి చెందిన చిట్యాల సుజిత్‌రెడ్డి కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు జిల్లా నాయకులు ఏలేటి అశ్విన్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట వివిధ మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కేజీబీవీలో ఉపాధ్యాయుల డిప్యూటేషన్లు విరమించుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమ్మె చేస్తున్న కేజీబీవీ ఉపాధ్యాయుల స్థానంలో ప్రభుత్వ ఉపాధ్యాయుల డిప్యూటేషన్లు విరమించుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టిఎస్‌యుటిఎఫ్) జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె. కిష్టన్న, వి.అశోక్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 17 రోజులుగా సమ్మె చేస్తున్న కెజిబివి, యుఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగులు, ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా శ్రమదోపిడీకి గురవుతోంది ఈ ఉద్యోగులేనని, చేస్తున్న పనికి సమానమైన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం వారు పనిచేస్తున్న పోస్టు మూల వేతనం ఇవ్వాలని మాత్రమే వారు కోరుతున్నారన్నారు. మొదటి పీఆర్సీ సిఫారసు మేరకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా సెలవులు, ఇంక్రిమెంట్లు ఇవ్వాలని కోరుతున్న న్యాయమైన సమస్యలను గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా ఏమాత్రమూ పట్టించుకోవటం లేదని ఆవేదన చెందుతున్నారన్నారు. ఆ క్రమంలోనే ఉద్యోగులు స్వచ్ఛందంగా నిరవధిక సమ్మెకు దిగారన్నారు. కెజిబివి, యుఆర్ఎస్, ఆశ్రమ పాఠశాలల్లో పిల్లలకు విద్యాబోధన కుంటుపడిందని, శుక్రవారం నుండి సమ్మెను ఉధృతం చేస్తామని వారు ప్రకటించారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రతిష్టకు పోకుండా చర్చలు జరిపి, సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని కోరారు.

క్రిస్మస్ వేడుకలతో ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ సర్వీస్ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేస్తున్న నిరసన దీక్ష బుధవారం 16వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా క్రిస్మస్ వేడుకలు జరుపుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు శృతిక మాట్లాడుతూ తమ సమ్మె 16వ రోజుకు చేరినప్పటికీ డిమాండ్‌లను పరిష్కరించడానికి ప్రభుత్వం చొరవ చూపకపోవడం అన్యాయమన్నారు. సమ్మె ప్రభావంతో రాష్ట్రం అంతా విద్యా వ్యవస్థ కుంటు పడిందన్నారు. కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో గత రోజులుగా విద్యార్థులకు బోధన అందటం లేదని, ఎంఆర్సీలలో ఎంఐఎస్‌లు, సీసీఓలు మెసెంజర్లు సమ్మెలో పాల్గొనడంతో రాష్ట్రం అంతటా ఎంఆర్సీలు, సిఆర్సీలు మూతబడి ఉన్నాయన్నారు. శిబిరంలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించి తమ డిమాండ్లు పరిష్కారం జరిగేలా చూడాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల జిల్లా ప్రధాన కార్యదర్శి తుకారాం, సంఘం జిల్లా కోశాధికారి నగేష్, మీడియా ప్రతినిధి గేడేకార్ సంతోష్, దుర్గం సందీప్, అన్నపూర్ణ, చైతన్య, కవిత, ఎంఐఎస్ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, రాజేష్, రాజ్‌కుమార్, సిసివో అధ్యక్షుడు అనూప్, సీఆర్పీ ప్రధాన కార్యదర్శి రాజేష్, వెంకటేష్, పీజీ సిఆర్టీలు అన్నపూర్ణ, స్వప్న, పిటిఐ అధ్యక్షుడు సత్యనారాయణ, రమేష్, ప్రకాష్, తిరుపతి, దేవేందర్, మహేష్, శివరాం, ప్రసన్న, స్వప్న, విజయ, బాబు, తిరుపతి, సుభాష్, సతీష్ పాల్గొన్నారు.





నిర్మల్‌లో నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

నిర్మల్ : సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగ, ఉపాధ్యాయుల డిమాండ్లను పరిష్కరించాలని ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం నాటికి 16వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు బుధవారం రోడ్ పే పడావో సికావో కార్యక్రమం చేపట్టి నిరసన తెలిపారు. విద్యా వ్యవస్థకు మూల స్తంభాలైన తమను రెగ్యులరైజ్ చేసి, విద్యాశాఖలో విలీనం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమ్మెకు ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు భీమేశ్వర్, శివ శంకర్, ఓయూ జేఏసీ ఫౌండర్, అధ్యక్షులు రాజారాం యాదవ్ తదితరులు సంపూర్ణ మద్దతు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా ఘనంగా క్రిస్మస్ వేడుకలు

- చర్చిల్లో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు
- యేసు జన్మవృత్తాంతం తెలిపేలా సెట్టింగ్‌లు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

క్రైస్తవులు అత్యంత వైభవోపేతంగా నిర్వహించుకునే క్రిస్మస్ వేడుకలు మంగళవారం రాత్రి నుండే ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలోని చర్చిలన్నీ విద్యుద్దీపాలంకరణలతో వెలుగులీనాయి. పట్టణంలోని తెలంగాణ కూడలిలో గల రోమన్ క్యాథలిక్ చర్చితోపాటు రవీంద్రనగర్‌లోని సీఎస్ఐ చర్చి, ఖానాపూర్‌లోని ఇండియన్ మిషన్ చర్చి, సుందరయ్యనగర్‌లోని మోరియా చర్చిలను అందంగా ముస్తాబు చేశారు. ఆయా చర్చిల్లో అర్ధరాత్రి దాటాక కేక్‌లు కట్‌చేసి క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు జీవితంలోని కీలక ఘట్టాలను వివరిస్తూ ఏర్పాటు చేసిన సెట్టింగ్‌లు వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యేసుక్రీస్తు జననంతో అర్ధరాత్రి నుండి ప్రారంభమైన వేడుకల్లో భాగంగా క్రైస్తవులు పురవీధుల్లో శోభాయాత్ర చేపట్టారు. భక్తి గీతాలు ఆలపిస్తూ ముందుకు సాగారు. అటు సామూహిక ప్రార్థనలు చేయడంతోపాటు బైబిల్ గురించిన ప్రవచనాలు, క్రిస్మస్ పర్వదిన ప్రాముఖ్యతను పాస్టర్లు వివరించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
గురువారం | డిసెంబర్ 26, 2024 | www.navatelangana.com

రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిర్మల్ రూరల్



నిర్మల్ పట్టణంలోని వెంకటాపూర్ నుండి నిస్సి చర్చ్ వరకు రూ.1.60 కోట్ల రూపాయలతో నిర్మించిన ఆర్అండ్‌బీ రోడ్డును ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించేల తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. నియోజకవర్గంలోని సమస్యలను తెలుసుకుంటు వాటిని పరిష్కరించేల చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యాం కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డివైడర్‌నీ ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-భైంసా



బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన భైంసా పట్టణ కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు బంధువులు తెలిపిన ప్రకారం.. పట్టణంలో నివాసం ఉంటున్న దగ్గె అమోల్(27) తమ ఏరియాలో ఓ ఫంక్షన్ ఉండగా కాలోని నుండి మార్కెట్‌లోకి గిఫ్ట్ కొనడానికి బైక్‌పై వచ్చాడు. ఇదే క్రమంలో స్థానిక శివాజీ చౌక్ ప్రాంగణంలో డివైడర్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య కుమారుడు ఉన్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం భైంసా ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పనిచేయాలి

- డీఎస్పీ జీవన్‌రెడ్డి



నవతెలంగాణ-తాంసి

మండలంలో శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీస్ సిబ్బంది పనిచేయాలని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. మొదట ఎస్సై రాధిక స్వాగతం పలికి పుష్పగుచ్చం అందజేశారు. అనంతరం పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించి పోలీస్ సిబ్బంది విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ అవరణలో మొక్కలు నాటారు. కేసులకు సంబంధించిన వివరాలను ఎస్సైని అడిగి తెలుసుకొని వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వార్షిక సంవత్సరంలో భాగంగా కేసులకు సంబంధించిన వివరాల పరిశీలనలో భాగంగా సందర్శించడం జరిగిందన్నారు. పోలీస్ సిబ్బంది తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని, ఎప్పటికప్పుడు మండలాల్లోని అన్ని గ్రామాలకెళ్లి ప్రజలతో మమేకం కావాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన వారి పట్ల మర్యాదగా వ్యవరించాలని, నిషేధిత మత్తు పదార్థాలు గంజాయి వంటి వాటిపై దృష్టి పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో రాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహించాన్నారు. కార్యక్రమంలో సిబ్బంది భాస్కర్, చిరంజీవి, సిరాజ్ ఖాన్ ఉన్నారు.

టీయూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) 2025 క్యాలెండర్‌ను ఎమ్మెల్యే పాయల శంకర్ ఆవిష్కరించారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే చేతులమీదుగా సంఘం నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలోనే కాకుండా సామాజిక స్పృహతో అనేక కార్యక్రమాలు చేయడం అభినందనీయమని కొనియాడారు. తన దృష్టికి తీసుకువచ్చిన ఉపాధ్యాయ, ఉద్యోగుల పెండింగ్ బిల్లులను మంజూరు చేయడానికి రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి రామకృష్ణారావు కలిసి మంజూరు చేయించేలా కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మ లచ్చిరాం, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, జలంధర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ప్రఫుల్ చందర్ రెడ్డి, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు రాథోడ్ బలిరామ్, ముసుకు సంజీవరెడ్డి, పెంట చంద్రమోహన్, యాళ్ల లింగారెడ్డి, పండరినాథ్, నాగన్న, చాట్ల స్వామి, భోజరెడ్డి, చంద్ర కిరణ్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే



నవతెలంగాణ-నిర్మల్ రూరల్

నిర్మల్ జిల్లా కేంద్రంలోని వెంకటపూర్ నిస్సి చర్చ్, గాజులపేట్ సీఎస్ఐ చర్చ్‌లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో బీజేఎల్పి నాయకుడు, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవ సోదర సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా, పట్టణ బీజేపీ నాయకులు

నిర్మల్ టౌన్ : నిర్మల్ జిల్లా కేంద్రంలోని గొల్లపేట్ ది లివింగ్ క్రైస్ట్ చర్చ్‌లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ గంద్రత్ ఈశ్వర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనతో పాటు కౌన్సిలర్ కొండ సబిత శ్రీధర్, మత పెద్దలు పాల్గొన్నారు.

తాంసి : ఏసుక్రీస్తు జన్మదిన పురస్కరించుకొని బుధవారం అర్ధరాత్రి నుండి తాంసి, భీంపూర్ మండలాల్లో క్రిస్మస్ వేడుకలను క్రిస్టియన్ సోదరులు ఘనంగా నిర్వహించుకున్నారు. తాంసి మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన చర్చినీ రంగు రంగుల విద్యుత్ దీపాలతో ఎంతో అండగా అలంకరించారు. బుధవారం చుట్టుపక్కల గ్రామాలకు చెందిన క్రైస్తవులు చర్చికి విచ్చేసి కేక్‌కట్ చేసి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బుధవారం ఏసుక్రీస్తు వేషధారణతో గ్రామంలోని వీధుల్లో తిరుగుతూ కేకులు మిఠాయిలు పంచిపెట్టారు. ఫాదర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వటోలి గ్రామ బూత్ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-భైంసా

మండలంలోని వటోలి గ్రామంలో బీజేపీ బూత్ కమిటీని ఎన్నుకున్నారు. బూత్ నెంబర్ 90వ అధ్యక్షుడిగా కె.విశ్వనాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శక్తి కేంద్ర ఇన్‌చార్జి, మహిళ మోర్చా నాయకురాలు సిరం సుష్మ రెడ్డి ఎన్నికల పరిశీలకురాలిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా కార్యకర్తలు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సచిన్, సీనియర్ అడ్వకేట్ గంగాధర్, జగత్ పటేల్ ఉన్నారు.

ప్రజల పక్షాన పోరాడేది ఎర్రజెండానే



నవతెలంగాణ-బేల

ప్రజల పక్షాన పోరాడేది ఎర్రజెండానే అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పూసం సచిన్ అన్నారు. జనవరి 25 నుంచి 28 వరకు సంగారెడ్డి పట్టణంలో నిర్వహించే పార్టీ రాష్ట్ర 4వ మహాసభల కరపత్రాలను బుధవారం మండలంలోని పాటగూడ గ్రామంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలో ఉన్న లేకున్నా ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించేది ఎర్ర జెండానే అని అందులో సీపీఐ(ఎం) పార్టీకి ప్రత్యేక విశిష్టత ఉందన్నారు. నిరంకుశంగా పాలించిన బీఆర్ఎస్‌ను ఓడించి ఆరు గ్యారంటీలను నమ్మి కాంగ్రెస్‌ను గెలిపిస్తే ప్రభుత్వం మారింది తప్పా ప్రజల సమస్యలు పరిస్కారం కావడం లేదన్నారు. ఒకటి రెండు గ్యారంటీలను అరకొరగా అమలు చేసి చేతులు ఎత్తేసే పని రాష్ట్ర ప్రభుత్వం పెట్టుకుందని విమర్శించారు. కార్మికులు, కాంట్రాక్టు ఉద్యోగులు, రుణమాఫీ కానీ రైతులు అన్ని వర్గాల ప్రజల్లో కాంగ్రెస్ పాలనపై వ్యతిరేకత పెరుగుతుందన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అంబానీ, అదానీల సర్కార్‌గా మారిందని ఎద్దేవ చేశారు. నిత్యావసర సరుకుల ధరలు,పెట్రోల్, గ్యాస్ ధరలు సామాన్యునికి అందకుండా చేసి కార్పొరేట్లకు లాభాలు చేయడమే పనిగా పెట్టుకుందని మండిపడ్డారు. ప్రజల వ్యతిరేకతను పక్కదారి పట్టించడానికి మతవిద్వేషాలు రెచ్చగొట్టి పాలించడం నేర్చుకుందని ఆరోపించారు. అందులో భాగాంగనే పార్లమెంట్‌లో అమీత్ షా అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాడే సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలకు ఆర్థిక, హార్దిక సహకారం అందించి జయప్రదం చేయాలనీ కోరారు. కార్యక్రమం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు స్వామి, గ్రామ పటేల్ తొడసం నాగోరావ్, గ్రామస్తులు శంబు లక్ష్మణ్, రాజేశ్వర్, అమృత్ పాల్గొన్నారు.

ఏడాదైనా చాయ్ తాగే సమయం దొరకలేదా..?



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తాము అధికారంలోకి వస్తే చాయ్ తాగే లోపు సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చిన సీఎం అధికారంలోకి వచ్చి సంవత్సరం అవుతున్న ఇంకా చాయ్ తాగే సమయం దొరకలేదా అని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. రెగ్యులర్ చేయాలనే డిమాండ్‌తో సమగ్ర శిక్ష ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె బుధవారం 16వ రోజుకు చేరుకుంది. దీక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే పాయల్ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఉద్యోగులకు అండగా ఉంటామని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం అవుతాయనే ఆలోచనతో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. వచ్చిన తెలంగాణలో పదేండ్ల పాటు ఎలాంటి అభివృద్ధి, ఉద్యోగులతో పాటు నిరుద్యోగుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. గత ప్రభుత్వాన్ని గద్దె దించుతే హక్కులు సాధించుకోవచ్చని కాంగ్రెస్‌ను గెలిపిస్తే గత ప్రభుత్వంలాగే కాంగ్రెస్ పాలన సాగుతోందన్నారు. సమగ్ర ఉద్యోగులు సమ్మె చేస్తున్న టీపీసీసీ హోదాలో సీఎం రేవంత్ రెడ్డి చాయ్ తాగే లోపు రెగ్యులర్ చేస్తామని చెప్పి కాలయాపన చేస్తున్నారన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడితో ప్రభుత్వానికి ఎస్ఎస్ఏ ఉద్యోగుల రెగ్యులర్ విషయమై సీఎంకు లేఖ రాస్తామన్నారు. అసెంబ్లీలో కూడా ఈ విషయమై చర్చించడం జరుగుతుందన్నారు. ఉద్యోగులను రెగ్యులర్ చేసేంత వరకు బీజేపీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, ఎన్నాల సగేష్, వేణుగోపాల్, ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్, పార్థసారథి, దేవదర్శన్, ప్రకాష్, ప్రియంక, రాజన్న, శ్రీకాంత్, బోజన్న పాల్గొన్నారు.

పలువురి సంఘీభావం

ఉద్యోగుల జేఏసీ చైర్మెన్ సంద అశోక్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు శివకుమార్, టీఎన్జీఓ ప్రధాన కార్యదర్శి ఏ.నవీన్ కుమార్ సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఫ్లకార్డులు ప్రదర్శిస్తు ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీకి అనుగుణంగా సమస్యలను పరిష్కరించాలని అప్పటి వరకు టీఎన్జీఓ సంఘం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీటీయూ జిల్లా అధ్యక్షుడు సోగాల సుదర్శన్ వార్డెన్ సంఘం అధ్యక్షుడు నర్సింలు, ఓం ప్రసాద్, డ్రైవర్ల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సబ్దార్ అలీ, పంచాయతీ కార్యదర్శులు సంఘం అధ్యక్షుడు సంజీవ్, కార్యదర్శి ధర్మయ్య, టీఎన్జీవో బాధ్యులు తిర్మల్ రెడ్డి, మహేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రాణం ఉన్నంతవరకు రుణపడి ఉంటా

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-కడెం



కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు ఖానాపూర్ నియోజకవర్గ ప్రాంత ప్రజలకు రుణపడి ఉంటానని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండలంలోని మాసాయిపేట్ గ్రామంలో సీజీఎఫ్ నిధులు రూ.20 లక్షలు, గ్రామ ప్రజల విరాళం రూ. 5లక్షలతో పున:నిర్మించిన హనుమాన్ దేవాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంట్లో ఉండే తనను చట్ట సభల్లో పంపిన ఈ ప్రాంత ప్రజల రుణం గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి తీర్చుకుంటానని తెలిపారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఉమ్మడి కడెం మండలంలోని లింగపూర్, దేవునిగూడెం, దస్తురాబాద్ గ్రామాల్లోని ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేశారన్నారు. మాసాయిపేట్ హనుమాన్ ఆలయం ప్రహరీ గోడకు రూ.7 లక్షలు మంజూరు చేశామని ప్రకటించారు. త్వరలో పనులను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మల మల్లేష్ యాదవ్, జిల్లా నాయకులు పొద్దుటూరి సతీష్ రెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు రేంకల శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ నిర్మల్ జిల్లా కార్యదర్శి ముడికే మల్లేష్ యాదవ్, లింగాపూర్ మాజీ సర్పంచ్ ఆకుల బాలవ్వ లచ్చన్న పాల్గొన్నారు.

అటల్ బిహారీకి జిల్లాతో అవినాభావ సంబంధం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మాజీ ప్రధాన మంత్రి అటల్ బీహారి వాజ్‌పేయికి జిల్లాతో అవినాభావ సంబంధం ఉందని, జాతీయ రహదారి నిర్మాణంతో పాటు జలధార పథకానికి బేల మండలం నుంచి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వాజ్‌పేయ్ శతజయంతి వేడుకలను నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. దేశానికి, జిల్లాకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకుంటు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ దేశ ప్రధానిగా ప్రతిపక్ష నాయకుడిగా పార్లమెంటరీయన్‌గా భారత దేశానికి అనేక సేవలు అందించారని తెలిపారు. జాతీయ రహదారి నిర్మాణంతో పాటు సుజలధార పథకానికి బేల మండలం అవల్పూర్ నుంచి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. వాజ్‌పేయ్ ఆలోచనల విధానాలకు అనుగుణంగా దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పాలన సాగిస్తున్నారన్నారు. దేశ అభివృద్ధి దిశగా పథకాలను అమలు చేయడంతో దేశ ఆర్థిక వ్యవస్థలో ఐదో స్థానానికి చేరిందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం, వేణుగోపాల్, లాలామున్న జ్యోతిరెడ్డి, మయూర్ చంద్ర, ప్రవీణ్, భీంసేన్ రెడ్డి, రాకేష్, సోమ రవి , పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్మల్ టౌన్ : అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి వేడుకలను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా వాజ్‌పేయి చిత్రపటానికి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాజ్ పేయి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా, పట్టణ, మండల, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యాలయంలో

జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో భారతరత్న అటల్ బిహారీ వాజపేయి శత జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రావుల రాంనాథ్, నాయకులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్

మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి శతజయంతి సందర్భంగా నిర్మల్ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం జిల్లా ఓబీసీ మోర్చా నాయకులు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యుడు కార్తీక్, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేంద్ర చారి, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు రాకేష్, గవాస్కర్ ఉన్నారు.



లబ్ధిదారులకు విద్యుత్ మోటార్ సెట్ల పంపిణీ



నవతెలంగాణ-తాంసి

మండలంలోని పోన్నారి గ్రామానికి చెందిన దళిత బస్తీ పథకంలో వ్యవసాయ భూమి పొందిన లబ్ధిదారులకు బుధవారం ఎస్సీ కార్పొరేషన్ నిధులతో ఉచిత విద్యుత్ మోటార్ పంపులను గ్రామ బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా మండల జనరల్ సెక్రెటరీ గంధం రమణ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో దళిత బస్తీ పథకంలో వ్యవసాయ భూమి పొందిన లబ్ధిదారులకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చొరవతో రూ.మూడు లక్షల విలువ గల సీఆర్ఐ విద్యుత్ మోటార్స్ పంపులు, స్టార్టర్ బోర్డు వాటికి సంబంధించిన పరికరాలను అందిచామన్నారు. గతంలో బీఆర్ఎస్ హయంలోనే బోర్లు వేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ముచ్చ, రేఖ రఘు, మాజీ సర్పంచ్ అండే అశోక్, సొసైటీ డైరెక్టర్ చంద్రన్న, సీనియర్ నాయకులు మల్లయ్య, అండే ఆనంద్, మాజీ ఎంపీటీసీ విలాస్, ఆశన్న, సాయినాథ్, లక్ష్మిపతి, నారాయణ, శ్రీకాంత్ రవి (లార) పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మెగా ఫ్యామిలీ ఫ్యాన్స్ సమావేశం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

శ్రీ అంజనీపుత్ర మెగా ఫ్యామిలీ ఫ్యాన్స్ సేవా సమితి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే చిత్రాలను, మున్ముందు కార్యక్రమాలను ఏ విధంగా ముందుకు తీసుకెళ్ళాలి అనేదాని గురించి చర్చించారు. ఈ మేరకు జిల్లా గౌరవ అధ్యక్షులు పర్వతనేని శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంకా కమిటీలు వేయని గ్రామాలలో ఆసక్తి గల వారు ఎవరైనా 9959566316, 9885401502 సంప్రదించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు, అభిమానులు జక్కుల కార్తీక్, భూపతి వివేక్, ధీరజ్, వినయ్, సంతోష్, రాము, రజనీకాంత్ పాల్గొన్నారు.

గవర్నమెంట్ ప్లీడర్‌కు సన్మానం



నవతెలంగాణ నిర్మల్‌టౌన్

నిర్మల్ జిల్లా కోర్టు గవర్నమెంట్ ప్లీడర్‌గా సీనియర్ న్యాయవాది బి.శు భకరన్ నియమితులైన సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ప్రెసిడెంట్ సయ్యద్ హైదర్ సన్మానించారు. ఈ మేరకు నిర్మల్ పట్టణంలోని ఆయన నివాసంలో శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వినోద్, సోఫి ఇమ్రాన్, ఆఖీఫ్, యాకిన్, అబ్దుల్ సాధిక్, జహీర్ అహ్మద్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

నవతెలంగాణ-నిర్మల్ రూరల్

గ్రామంలో అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సోన్ మండల వాసులు కోరారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా బుధవారం సోన్‌లో పర్యటించిన బీజేఎల్పీ నాయకుడు, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి దళితుల శ్మశానవాటికకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే స్పందించిన ఆయన రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. స్పందించిన ఎమ్మెల్యేకు ధన్యవాదలు తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన శబరిమాతా ఆశ్రమ సభ్యులు



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రానికి చెందిన శబరిమాత ఆశ్రమ సభ్యులు బుధవారం ఎమ్మెల్యే అనిల్ జాధవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శబరిమాత ఆశ్రమ సభ్యులు మాటడుతూ మండల కేంద్రంలోని ఆశ్రమ షెడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు ఆయనను కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను ఆశ్రమ సభ్యులు ఘనంగా సన్మానించారు. అలాగే ఎమ్మెల్యే మాట్లాడుతూ మాత ఆశీర్వాదాంతో ఎమ్మెల్యే అయ్యాయని ఆశ్రమ సేవలో తాను భాగస్వామ్యం అవుతానన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సురేందర్, ప్రధాన కార్యదర్శి ఎలుక రాజు, యూత్ అధ్యక్షులు ప్రవీణ్, సభ్యులు పాల్గొన్నారు.

గుండెపోటుతో యువకుడు మృతి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మండలంలోని బూరుగూడ గ్రామానికి చెందిన మేకర్తి యుగేంధర్ (39) గుండెపోటుతో మంగళవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. యుగేంధర్ రోజులాగే వ్యవసాయ పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికివచ్చి భోజనం చేసి పడుకునే సమయంలో ఒకేసారి గుండెనొప్పి వచ్చింది. వెంటనే కుటుంబీకులు ఆసిఫాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తీసుక వెళ్లడంతో అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. అప్పటివరకు అందరితో కలసిమెలసి ఉన్న అయన ఒక్కసారి గుండెనొప్పితో మృతి చెందడంతో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. మృతునికి భార్య, ఒక కుమారుడు, ఒక కూతురు ఉంది.

ఘనంగా టీఎన్ సదలక్ష్మమ్మ జయంతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



మాజీ మంత్రి, తెలంగాణ రాష్ట్ర ఉద్యమ వ్యవస్థాపకురాలు, తొలిదశ శాసన సభ్యురాలు టీఎన్ సదలక్ష్మమ్మ 96వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలామలలు వేసి నివాళు లర్పించారు. ఆమె చేసిన సేవలను కొనియాడుతూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాదిగ సంఘాల మహాకూటమి రాష్ట్ర వైస్ చైర్మన్, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి ఇరిగిరాల భాస్కర్, గోగర్ల నరేష్, పట్టణ అధ్యక్షులు కోగిల శ్రీమన్, పొగర్త సుభారావు, బిగిలి సుభయ్య, గోగర్ల నర్సయ్య, శెట్టి తిరుపతిరావు, అయిళ్ల శ్రీనివాస్, పి.చిన్నోడు, పి.నాని, ఊర. సారమ్మ పి.నరేందర్, గోగర్ల కుమార్ పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గోలేటి గ్రామంలో బుధవారం అనిల్ అన్న యువ సైన్యం ఆధ్వర్యంలో 200 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కొక్కిరాల విశ్వప్రసాదరావు, అనిల్ అన్న యువ సైన్యం ఫౌండేషన్ చైర్మన్ జువ్వాజీ అనిల్ గౌడ్ పాల్గొని చలి తీవ్రత దృష్ట్యా దుప్పట్లను అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ నినాదంతో అనిల్ అన్న యువ సైన్యం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. మండలంలోని అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న నేపథ్యంలో చలి తీవ్రత పెరిగిందన్నారు. వృద్ధులు ఇబ్బందులు పడకుండా తమ వంతు బాధ్యతగా దుప్పట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమేత విశ్వనాథ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు పాస్తం పోషం, ఆసిఫాబాద్, తిర్యాణి మండలాల అధ్యక్షులు చరణ్, చిత్తారి సాగర్, కేసరి కిషన్ గౌడ్, చెన్న సోమశేఖర్, కొవారి శ్రీనివాస్, మద్దెల సురేందర్ రాజ్, ప్రభాకర్, దుర్గం రవీందర్, కమల్‌నాథ్ రెడ్డి, కిషోర్, సంజయ్ తిరుపతి, కుసుమ, విజయ, కల్పన క్రాంతి పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



నవతెలంగాణ-దహెగాం

మండలంలోని గిరవెల్లి గ్రామంలో బుధవారం బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు దందేర మల్లేష్ ఆధ్వర్యంలో గిరవెల్లి యూత్ గ్రామపంచాయతీ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నియోకవర్గ ఇన్‌చార్జి లెండుగురే శ్యామ్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టోర్నమెంట్‌లో నియోజకవర్గంలోని 50 గ్రామపంచాయతీల నుండి జట్లు పాల్గొననున్నాట్లు తెలిపారు. యువతలో క్రీడా స్ఫూర్తిని ప్రోత్సహించడం కోసం నిర్వహించబడుతోందని, టోర్నమెంట్ ద్వారా యువతకు ఒక మంచి వేదికను అందించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు కొండా రాంప్రసాద్, కాశిపాక రాజు, ఆవుల రాజ్ కుమార్ యాదవ్, మాజీ సర్పంచ్ కారు రాజన్న, శోభన్, దాసరి నరేందర్, బాబ్లు, భుజడి వెంకటేష్, లంగరి శేఖర్, టోర్నమెంట్ కమిటీ సభ్యులు, గిరవెల్లి గ్రామ యువకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన కాలనీవాసులు



నవతెలంగాణ-సిర్పూర్(టి)

మండల కేంద్రంలోని బెస్తవాడలో నివసిస్తున్న కేతమ్మ అనే వృద్ధ మహిళ ఏడాది కాలం నుండి పక్షవాతంతో మంచాన పడింది. ఆమెకి సహాయం చేయుటకు సంతానం కూడా లేదు. కొన్ని సంవత్సరాల క్రితం భర్త కూడా మరణించాడు. కాలనీవసూలు, బంధువుల సాయంతో కాలం వెల్లదిస్తుంది. అనారోగ్యానికి గురైన వృద్ధురాలిని కాలానివాసులు మానవత్వంతో హాస్పిటల్ తీసుకెళ్లారు. తినడానికి, మందులకు డబ్బులులేక ఎవరైనా సహాయం చేయండి అని కన్నీటితో ఆశగా ఎదురు చూస్తున్న సమయంలో వారం క్రితం ప్రభాకర్ మేస్త్రి, దాస్ అయ్యప్ప భక్తుడు ముందుకువచ్చి సోషల్ మీడియా ద్వారా సమాచారాన్ని చేరవేశాడు. దాతల సాకారం కోరగా ఎస్ఐ కమలాకర్ 25 కేజీల బియ్యాన్ని అందించారు. ఇంకా కొంత మంది నాయకులు స్థానికులు చేయూతనిచ్చారు. బుధవారం కాగజ్‌నగర్‌కు భారతీయ సేన సేవ సమితి రూ.మూడు వేలు ఆస్పత్రి ఖరులకు, నెలకు సరిపడ వస్తువులు అందించారు. దాతలు ఇంకేరవైన ముందుకు వచ్చిన వృద్దురాలికి ఆర్థిక సాయం అందించాలని మండల వాసులు కోరుతున్నారు.

పత్తి కొనుగోలు తాత్కాలికంగా నిలిపివేత

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని జిన్నింగ్ మిల్లులలో నేపథ్యంలో పత్తి, పత్తి గింజల నిల్వలు ఎక్కువ అయినందున పత్తి కొనుగోలు ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేయడం జరుగుతుందని జిల్లా మార్కెటింగ్ అధికారి అశ్వక్ అహ్మద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, సిర్పూర్, కౌటాల, జైనూర్‌లలో గల జిన్నింగ్ మిల్లులలో ఈనెల 29 వరకు ఐదు రోజుల పాటు పత్తి కొనుగోలు ప్రక్రియ నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు. తర్వాత యధావిధిగా కొనుగోలు జరుగుతుందని వివరించారు. రైతుల వద్ద పత్తి పంట పూర్తయ్యే వరకు ప్రభుత్వమే కొనుగోలు చేయడం జరుగుతుని అన్నారు. ఈ ఐదు రోజులు ఎవరు కూడా సీసీఐ కాకుండా దళారులకు అమ్మి నష్టపోవద్దని సూచించారు. ఐదు రోజుల పాటు పత్తి కొనుగోళ్లు నిలిపివేయడం జరుగుతుందని ఈ విషయాన్ని గమనించి సహకరించాలని తెలిపారు.

అయ్యప్ప ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహెూత్సవంలో భాగంలో మొదటి రోజు బుధవారం అచ్చులపూర్ వేదపండితులతో మంగళ వాద్యల మధ్య వేద స్వస్తి వాచనంలతో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాశనం, యాగశాల ప్రవేశం, అఖండ దీప ప్రజ్వలన, స్థాపన, నవగ్రహ, మాతక, యోగిని క్షేత్రపాల, సర్వతో భద్ర మండల దేవత స్థాపన పూజలు, హోమం, జలాధివాసం, మూల విరాట్టుకు అష్టోత్తర శతఘటాభిషేకం, ధాన్యాధివాస, పుష్పాధివాస, ఫలాధివాస, శయ్యాది వాసము, హారతి, మంత్ర పుష్పము, చతుర్వేద సేవలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

27, 28 రెండు రోజుల టోకెన్ సమ్మె

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్



నవతెలంగాణ-రెబ్బెన

తెలంగాణ గ్రామ పంచాయితీ సిబ్బందినీ పర్మినెంట్ చేసి వేతనాలు పెంచాలని, జీఓ నెం.51ని సవరించి, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, కేటగిరీల వారీగా వేతనాలను పెంచాలనే ఈనెల 27, 28 తేదిల్లో టోకెన్ సమ్మె నిర్వహిస్తున్నామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అనేకసార్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడంలేదన్నారు. కార్మికుల సమస్యలపై ఉద్యోగ సంఘాల జేఏసీతో చర్చలు జరపాలని ప్రభుత్వనికి విన్నవించిన పట్టింపు లేదన్నారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన పోరాటాలతో పాటుగా డిశంబర్ 27, 28 తేదీలలో రెండు రోజుల పాటు టోకెన్ సమ్మెకు వెళ్ళుతున్నామని తెలిపారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ జేఏసీ నాయకులు రమేష్, వెంకటేష్, దేవాజి, ప్రవీణ్, సునీల్, శేఖర్ పాల్గొన్నారు.

మనుస్మృతి నేటి సమాజానికి అవసరం లేదు

- దళిత సంఘాల నాయకులు



నవతెలంగాణ-వాంకిడి

మనిషిని మనిషిగా చూడని మనుస్మృతి గ్రంథం నేటి ఆధునిక సమాజానికి అవసరం లేదని సమాజ్ క్రాంతి అఘాడి రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం తిరుపతి, భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కార్, భారతీయ బౌద్ధ మహాసభ మండలాధ్యక్షుడు ఉప్రే జైరాం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధవిహార్ ముందు మనుస్మృతి గ్రంథం దిష్టిబొమ్మను దగ్ధం చేసి దహన దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1927 సంవత్సరంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మహాడ్ పట్టణంలో మొదటిసారి దగ్ధం చేశారని, 97 సంవత్సరాలుగా దేశంలో ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. పశువుల కన్న మనుషులకు విలువనివ్వని అంశాను ఈ గ్రంథం పొందుపరచారన్నారు. కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా ఆర్గనైజర్ ఉప్రే విజయ్, అంబేద్కర్ సంఘం ప్రధాన కార్యదర్శి దుర్గం సునీల్‌కుమార్, ఉపాధ్యక్షులు దుర్గం హంసరాజు, దుర్గం శ్యామ్‌రావు, సమాజ అధ్యక్షుడు కోబ్రాగడే విలాస్, మహాత్మా రాజేంద్రప్రసాద్, నాయకులు ఉప్రే రోషన్, రాంటెంకి ప్రతాప్, కమాన అంబేద్కర్ యువజన సంఘం నాయకులు మారుతి, శంకర్, గెడాం హిరీశన్, విలాస్, కన్నర్‌గాం గ్రామస్తులు జాడే మొండి, జాడే రాందాస్, మహాత్మా ప్రకాష్, జైపాల్, దళిత సంఘాల నాయకులు, అంబేద్కర్ వాదులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

- చర్చిల్లో పాస్టర్ల ప్రత్యేక ప్రార్థనలు



ఆసిఫాబాద్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహించే క్రిస్మస్ వేడుకలు జిల్లా కేంద్రంలో చర్చిలలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి ప్రత్యేక ప్రార్థనలు చేయగా వేడుకల సందర్భంగా దస్నాపూర్‌లోని ఏజీ లైఫ్ చర్చ్, జనకాపూర్ రాజంపేట సందీప్ నగర్ జూబ్లీ మార్కెట్‌లలోని చర్చిలలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. క్రిస్మస్ సందర్భంగా చర్చిలలో ఏసుక్రీస్తు జీవిత చరిత్రను తెలిపే విధంగా పిల్లలు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. సీఎస్ఐ చర్చిలో పాస్టర్ రాజశేఖర్, దస్నాపూర్ ఏజీ లైఫ్ చర్చిలో పాస్టర్ కరుణకుమార్ దంపతులు కేక్‌కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అన్ని చర్చిలను అందంగా ముస్తాబు చేసి వేడుకలు నిర్వహించారు. పలువురు క్రిస్మస్ తాత వేషధారణలో ఆకట్టుకున్నారు.

కెరమెరి : మండల కేంద్రంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పాస్టర్ ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కేక్‌కచ్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

సిర్పూర్(టి) : ఏసుక్రీస్తు జన్మదిన క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని మండలంలోని బిలీవర్స్ చర్చ్, కల్వరి చర్చ్, క్యాథలిక్ చర్చిలలో వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. జన్మదినానికి సంబంధించిన నాటికలతో పాటు క్రీడా పోటీలు నిర్వహించారు. ఆయా చర్చలలో పాస్టర్లు బైబిల్‌లో ఉన్న ప్రవచనాలను చదివి వినిపించారు. ఒకరికొకరు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

వాంకిడి : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో బుధవారం క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని చర్చిలో ఉదయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు అన్నదానం నిర్వహించారు. అందరు సుఖసాంతోషాలతో ఉండాలని ఏసుక్రీస్తును ప్రార్థించినట్టు పాస్టర్ ప్రభాకర్ తెలిపారు.

పెంచికలపేట్ : క్రిస్మస్ వేడుకలను బుధవారం మండల వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. ఆయా చర్చిల్లో ఫారదర్లు ఏసు జననం గురించి తెలియజేయారు. అదే విధంగా ఏసు క్రిస్తు జనన ఇతివృత్తంతో నాటికలు కూడా ప్రదర్శించారు. అనంతరం కేక్‌కట్ చేసి తినిపించుకుంటు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



సిర్పూర్(టి)

ఘనంగా మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

దేశం మాజీ ప్రధాని, బీజేపీ దివంగత నాయకుడు అటల్ బీహర్ వాజ్‌పేయి జయంతిని జిల్లా కేంద్రంలో ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రాల్లో కేక్‌కట్ చేయడంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ చరిత్రలో గొప్ప వ్యక్తి వాజ్‌పేయని కొనియాడారు. పోక్రాన్ అణు పరీక్షల ద్వారా యావత్ ప్రపంచం భారతదేశం వైపు చూసేలా చేశారన్నారు. అటువంటి మహానుభావుడు భారతదేశానికి దొరకడం దేశ ప్రజల అదృష్టమన్నారు. నేడు ఆయన మన మధ్య లేకపోవడం బాధాకరమని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లికార్జున్, బీజేపీ జిల్లా నాయకుడు విజయ్, జిల్లా ఉపాధ్యక్షుడు విశాల్, జిల్లా నాయకుడు బోనగిరి సతీష్ బాబు, మాజీ వైస్ ఎంపీపీ సుంకరమంగా పెంటయ్య, జిల్లా కార్యదర్శి కుందరపు బాలకృష్ణ, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇగురపు సంజీవ్, జిల్లా ఉపాధ్యక్షులు రాంబాబు, బీజేపీ దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మటూరి జయరాజ్, కార్తిక్, సాయి పాల్గొన్నారు.

పెంచికలపేట్ : మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా మండలకేంద్రంలో బీజేపీ జిల్లా, మండల ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ కూలీలకు అరటిపండ్లను పంపిణీ చేశారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా నాయకుడు చపిడె సత్యనారాయణ, భుజంగరావు, బీజేపీ మండలాధ్యక్షుడు మధూకర్, మాజీ ఎంపీటీసీ రాజన్న, పాలే మహేష్, కాంతారావు, నానయ్య, సంతోష్, హరీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



డైట్ కళాశాల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో డైట్ కళాశాల తరగతులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని జనకాపూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉదయ బాబు కోరారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డైట్ కళాశాలకు భవనం ప్రారంభమైన తరగతులు ప్రారంభం కాలేదన్నారు. దీంతో జిల్లాలోని అనేక మంది విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. వెంటనే బోధన, బోధనేతర సిబ్బందిని నియమించి తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీఎస్ఎస్ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుభాష్, ఉపాధ్యాయులు హేమంత్ షిండే, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని ఎల్లూరు గ్రామానికి చెందిన మహమ్మద్ సబియాకు సీఎం సహాయ నిధి ద్వారా వచ్చిన చెక్కును అందించారు. బుధవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి బీజేపీ నాయకులు అందించి ఆరోగ్య విషయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దూగుంట రాజన్న, బీజేపీ మండల అధ్యక్షుడు మధూకర్, నాయకులు పాల్గొన్నారు.

వాజ్‌పేయి నిజమైన జాతీయవాది

- సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

దేశ మాజీ ప్రధాన మంత్రి అటల్ బీహారి వాజ్‌పేయి నిజమైన జాతీయవాదని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. బుధవారం పట్టణంలోని శ్రీలక్ష్మీ నర్సింగ్ హోంలో భారతరత్న అటల్ బిహారీ వాజపేయి శత జయంతి సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్‌తో కలిసి వాజ్‌పేయి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అటల్ బిహారీ వాజ్‌పేయి నిజమైన జాతీయవాదని, భారత మాత సేవకు తన జీవితాన్ని అర్పించారని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ఆయన ఆలోచనలు, ఆకాంక్షలకు వారసులుగా మనం పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పెట్రోల్ పంపు నుండి ఎల్లగౌడ్ తోట సామాజిక ఆస్పత్రి వరకు బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి అక్కడి రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు సిందం శ్రీనివాస్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కోఆర్డినేటర్ గోలెం వెంకటేష్, ఆర్మీ శివ, జిల్లా మహిళా మోర్చ అధ్యక్షురాలు వలుపదాసు శ్రీదేవి, రమేష్, చిప్ప మౌనిక, హనుమంత్ రావు, సంతోష్ ఠాకూర్, మండల అధ్యక్షులు రాపర్తి ధనుంజయ్, చిప్పకుర్తి శ్రీనివాస్, కొండ తిరుపతి, సుమన్, బాబురావు, రమేష్, ప్రణయ్, సౌరభ్, సదానందం పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలి

నవతెలంగాణ-దహెగాం

పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజన్ అన్నారు. బుధవారం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌కు వచ్చిన డీఎస్పీకి పోలీసులు గౌరవ వందనం సమర్పించి స్వాగతం పలికారు. స్టేషన్ ఆవరణను పరిశీలించి పలు కేసుల్లో పట్టుబడి స్వాధీనంలో ఉన్న వాహనాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో హాజరులో ఉన్న సిబ్బందితో మాట్లాడారు. వారికి కేటాయించబడిన విధులు అడిగి తెలుసుకున్నారు. సరైన పద్ధతిలో రికార్డుల నిర్వహణ, నమోదైన కేసుల వివరాలు సీసీటీఎన్ఎస్‌లో పొందుపరచాలన్నారు. పెండింగ్ కేసులపై సమీక్షించారు. త్వరితగతిన వాటిని పూర్తి చేయాలనీ సూచించారు. నమోదైన సైబర్ నేరాల గురించి తెలుసుకున్నారు. విసిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గ్రామాల వారీగా పోలీసు స్టేషన్ పరిధిలోని అన్నీ గ్రామాలకు పోలీసు అధికారులను కేటాయించాలని ఆదేశించారు. నూతనంగా విధుల్లో చేరిన కానిస్టేబుళ్లకు పలు సూచనలు చేశారు. పోలీసు స్టేషన్‌లో అన్ని రకాల విధులను సక్రమంగా నేర్చుకోవాలన్నారు. రికార్డ్ నిర్వహణ, సీసీటీఎన్ఎస్, రిసెప్షను, కోర్టు డ్యూటీ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, బీట్, పెట్రోలింగ్, సమన్లు తదితర విధులను సీనియర్ల ద్వారా తెలుసుకోవాలన్నారు. నిజాయితీ, క్రమశిక్షణ, సమయపాలన తప్పనిసరని తెలిపారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ప్రతి నెల వారికి సంబంధించిన నూతన సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి నమోదు చేసుకోవాలన్నారు.



బస్టాండ్‌లో మదర్ ఫీడింగ్ బాక్స్ ప్రారంభం

నవతెలంగాణ-జన్నారం



స్థానిక బస్టాండులో మదర్ ఫీడింగ్ బాక్స్‌ను లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ నడిపెల్లి వెంకటేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లులు తమ చిన్నారులకు ఇబ్బంది పడకుండా పాలను ఇవ్వడానికి ఫీడింగ్ బాక్స్ ఉపయోగపడుతుందన్నారు. ఫీడింగ్ బాక్స్ ఏర్పాటు చేయడానికి సహకరించిన పొన్కల్ మాజీ సర్పంచ్ జక్కు భూమేష్‌ను అభినందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కస్తూరి సతీష్, సందీప్, జగదీష్, వాలేటి శ్రీనివాస్, అంజిత్ రావు, శ్రీకాంత్‌రెడ్డి, జక్కు భూమేష్ ఉన్నారు.

యువతి వివాహానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని పొన్కల్ మేజర్ గ్రామపంచాయతీలోని నిరుపేద కుటుంబానికి చెందిన జూల సాగరిక వివాహానికి బుధవారం స్థానిక మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ రూ.5000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన సాగరిక వివాహానికి దాతలు ముందుకు వచ్చి సహకారం అందించాలన్నారు. ఆపేదింటి అమ్మాయి పెండ్లికి పెద్దలుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యులు మునివర్ అలీ ఖాన్, మాజీ సర్పంచ్ జాడి గంగాధర్, ఫజల్ ఖాన్, రాగుల శంకర్, సుల్వ జనార్ధన్ జంగం రవి పాల్గొన్నారు.

కల్వరీ చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

● భారీగా హాజరైన క్రైస్తవులు, ప్రత్యేక ప్రార్ధనలు చేసిన పాస్టర్ ప్రవీణ్

నవతెలంగాణ-కాసిపేట

సోమగూడెం, బెల్లంపల్లి రహదారి మధ్యలోని కల్వరీ చర్చిలో బుధవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపి, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కల్వరీ పాస్టర్ ప్రవీణ్ ప్రత్యేక ప్రార్ధనలు చేసి భారీగా హాజరైన క్రైస్తవులను, ప్రముకులను, నాయకులను దీవించారు. యేసు జీవిత చరిత్రను వివరిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేసి భక్తులను దీవించారు. ఈ సంధర్భంగా చిన్నారుల సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. దీంతో పాటు సోమగూడెం, కాసిపేట, దేవాపూర్ తదితర గ్రామాల్లోని చర్చిల్లో ఘనంగా క్రిస్మస్ వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ చైర్మన్ జక్కుల శ్వేత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రాంచందర్, ముత్తె భూమయ్య పాల్గొన్నారు.



కాసిపేటలో..

క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న డీసీసీ అధ్యక్షురాలు

లక్షెట్టిపేట : క్రిస్మస్ సందర్భంగా పట్టణంలోని నిర్వహించిన పలు వేడుకల్లో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాలు సురేఖ ప్రేమ్ సాగర్ రావు పాల్గొన్నారు. పట్టణంలోని సీఎస్ఐ చర్చ్‌ల్లో ప్రెస్బిటర్ ఇన్‌చార్జి రేవ ఎస్ డేవిడ్ పాల్ సమక్షంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్ధనలో పాల్గొని కేక్ కట్ చేసిన అనంతరం క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగ ఆమె మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధిక మంది శాంతిని కాంక్షిస్తూ జరుపుకునే క్రిస్మస్ పండుగను క్రైస్తవులంతా సంతోషంగా జరుపుకోవాలని కోరారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం అన్ని పండగలను ఆదరిస్తుందని, నియోజకవర్గ అభివృద్ధికి ప్రభు దీవెనలతో ముందుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీసీసీ చైర్మెన్ కొట్నాక్ తిరుపతి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ ఆరిఫ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నలిమేలా రాజు, మహిళా అధ్యక్షురాలు పెంట రజిత, పట్టణ కౌన్సిలర్లు, కాంగ్రెస్ కార్యకర్తలు, చర్చి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జన్నారం : మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని బుధవారం మండలంలోని మందపల్లి, మండల కేంద్రంలో, సీఎస్ఐ చర్చిలో పాస్టర్లు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు బోధనలను చదివి వినిపించారు. అనంతరం అందరూ కలిసి ఏసుక్రీస్తు భక్తి గీతాలు పాడారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



లక్షెట్టిపేటలో..



జన్నారంలో..

సిమెంట్ కంపెనీ అమ్మకాన్ని ఉపసంహరించుకోవాలి



నవతెలంగాణ-కాసిపేట

మండలంలో దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీని బిర్లా కంపెనీ యాజమాన్యం అదానీ గ్రూపుకు అమ్మకం నిర్ణయాన్ని యాజమాన్యం ఉపసంహరించుకోవాలని ఓరియంట్ కంపెనీ గుర్తింపు సంఘం మాజీ అధ్యక్షుడు ఓరియంట్ సిమెంట్ పర్మినెంట్ వర్కర్స్ లోకల్ యూనియన్ అధ్యక్షుడు రాములు నాయక్ డిమాండ్ చేశారు. ఓరియంట్ కార్మికుల సమస్యపై గుర్తింపు సంఘం మాజీ అధ్యక్షుడు రాములు నాయక్ తలపెట్టిన 24 గంటల నిరహార దీక్ష బుధవారంతో ముగిసింది. ఈ సంధర్భంగా పలువురు నాయకులు నిమ్మరసం అందించి దీక్ష విరమింప చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఓరియంట్ కంపెనీ హెచ్ఆర్ జీఎం కులకర్ణికి అందించారు. ఈ సంధర్భంగా రాములు నాయక్ మాట్లాడుతూ ఆదానీ గ్రూపుకు బిర్లా కంపెనీ యాజమాన్యం అమ్మకానికి పెట్టిన నిర్ణయాన్ని రద్దు చేసుకోవాలి, ఓరియంట్ ఎథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జనరల్ సెక్రెటరీ రొడ్డ రమేశ్, లంబాడా జేఏసీ జిల్లా అధ్యక్షుడు సపాట్ శంకర్, నాయక్ పోడ్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, యూనియన్ నాయకులు తత్ర భీంరావు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ నాయకుల గని సందర్శన



నవతెలంగాణ-మందమర్రి

కార్మికుల సమస్యలు తెలుసుకోవడానికి ఏఐటీయూసీ నాయకులు బుధవారం కేకే గనిలో పర్యటించారు. ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కేకే-5 గనిలో బెల్లంపల్లి రీజియన్‌లో ఆడిట్ పేరుతో కార్మికులను ఇబ్బందికి గురి చేయడాన్ని తప్పుబట్టారు. కంపెనీ అవసరాలరీత్యా సర్ఫేస్‌లో పనులు కేటాయించడంతో కార్మికులు ల్యాంప్ రూమ్‌లో లైట్లు తీసుకొని సర్ఫేస్‌లో విధులు నిర్వహిస్తున్న కార్మికులను ఇబ్బందికి గురి చేస్తూ లెటర్స్ ఇష్యూ చేయడం అదేవిధంగా మస్టర్స్‌ను కట్ చేయడం చట్ట విరుద్ధమని అన్నారు. అండర్ గ్రౌండ్‌లో డ్యూటీ చేసి అవుట్ పడిన తర్వాత కూడా ఒక కార్మికుడి మస్టర్ కట్ చేయమని లెటర్ ఇవ్వడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టోర్‌లో 5 గురు కార్మికులు లంచ్ బ్రేక్‌కు వెళ్లి ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినందుకు ఆడిటింగ్ వారు కార్మికుల ఫుల్ మస్టర్ కట్ చేయడం సరికాదన్నారు. ప్రొఫెషనల్ వేజెస్ కట్‌కు బదులు ఫుల్ వేజెస్ కట్ చేయడం అన్యాయమని దీనిపై కోర్టుకు వెళ్లి పోరాడుతామని తెలిపారు. యాజమాన్యం తక్షణమే స్పందించి ఆడిట్ విభాగం అధికారులతో మాట్లాడి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ భీమ నాధుని సుదర్శన్, సహాయ కార్యదర్శి సోమిశెట్టి రాజేష్, ఏరియా జాయింట్ సెక్రెటరీ కంది శ్రీనివాస్, ఏరియా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆంటోని దినేష్, పిట్ కార్యదర్శి గాండ్ల సంపత్, పిట్ సహాయ కార్యదర్శి ప్రేమ్ లాల్, మైనింగ్ స్టాఫ్ నాయకుడు బానోతు నాగేశ్వరరావు, సేఫ్టీ కమిటీ పిట్ కమిటీ సభ్యులు పూదరి శ్రీకాంత్, పంగ చంద్రశేఖర్, సాంబ శ్రీకాంత్, భగవాన్‌రెడ్డి, ఊరకొండ శ్రీకాంత్ పాల్గొన్నారు.

రక్తహీనతపై కార్మికులకు అవగాహన

నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి వృత్తి శిక్షణ కేంద్రంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కారుణ్య ఉద్యోగం పొందిన నూతన కార్మికులకు రక్తదానం, తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిపై బుధవారం అవగాహన నిర్వహించారు. వృత్తి శిక్షణ కేంద్రం జీవీటీసీ మేనేజర్ శంకర్ మాట్లాడుతూ 26వ తేది రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రక్తదాన శిబిరానికి ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్ హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. జీఎం సూచన మేరకు గనులు, డిపార్ట్మెంట్ల నూతన కార్మికులతో రక్తదానం నిర్వహిస్తున్నామని అన్నారు. కార్మికులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసి తల సేమియా వ్యాధి గ్రస్తులకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ అధికారి అశోక్ కుమార్, హెడ్ఓవర్‌మెన్ గురుమూర్తి, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా సభ్యుడు కాసర్ల శ్రీనివాస్, రెడ్ క్రాస్ సొసైటీ బెల్లంపల్లి సబ్ డివిజన్ సభ్యుడు సూరం లక్ష్మీనారాయణ, తల సేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంస్థ కార్యదర్శి కాసర్ల రంజిత్ కుమార్ పాల్గొన్నారు.



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ

నవతెలంగాణ-జన్నారం

ఇంటర్నేషనల్ డిస్టిక్ 320జి రీజియన్ 3 జోన్ 1 గవర్నర్ నడిపెల్లి వెంకటేశ్వరరావు జన్నారం లైన్స్ క్లబ్‌ను సందర్శించి పలు కార్యక్రమాలు చేపట్టారు. మొదటగా పైడిపల్లి గ్రామస్తులకు దుప్పట్లు పంచడం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రోగ్రాం చైర్మన్ గా జగదీష్, అలాగే మండల్ లెవెల్ షటిల్ టోర్నమెంట్ శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ప్రారంభించారు. దాంతోపాటు జన్నారం బస్టాండ్‌లో మదర్ ఫీడింగ్ రూమ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి చైర్మన్‌గా లయన్ జక్కు భూమేష్ వ్యవహరించారు. చివరకు లైన్స్ క్లబ్ చేరుకొని స్పెషల్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ మీటింగ్ నిర్వహించి క్లబ్ ఆరోగ్య పరిస్థితులను వివరించారు. స్పెషల్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ మీటింగ్‌కు ప్రోగ్రాం ఇన్‌చార్జిగా కొమురవెల్లి లచ్చన్న వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కస్తూరి సతీష్ కుమార్ సెక్రెటరీ కొమురవెల్లి సందీప్ కుమార్, ట్రెజరర్ జగదీష్, వాలెట్ శ్రీనివాస్, జెడ్పీ అంజిత్ రావు, రీజినల్ సెక్రటరీ అణుముల రాజన్న, రీజనల్ ట్రెజరర్ జక్కు భూమేష్, సభ్యులు రామడుగుల రమేష్‌రావు, వావిలాల రాజేందర్, వెలగందుల సురేష్, సింఢ్ల మల్లేష్, ఎర్ర ప్రవీణ్ కుమార్, నరేంద్ర గోపి, నడిపెల్లి విజయ్ కుమార్ పాల్గొన్నారు.



హనుమాండ్ల మధుకర్‌కు నగదు పురస్కారం

నవతెలంగాణ-తాండూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, సారిపల్లి కొండలరావు ఫౌండేషన్ సౌజన్యంతో యువకళావాహిని, తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణానికి చెందిన తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి హనుమాండ్ల మధుకర్‌ను హైదరాబాద్ రవీంద్ర భారతిలో సోమవారం సాయంత్రం నగదు పురస్కారంతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సన్మాన కార్యక్రమంలో సభాధ్యక్షులు సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు, ముఖ్య అతిథులు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా.కెవి రమణచారి, అతిథులుగా సంగీతనాటక అకాడమి చైర్‌పర్సన్ అలేఖ్య పుంజాల, సాంస్కృతిక సారథి చైర్మన్ డాక్టర్ వెన్నెల దైవజ్ఞ శర్మ హాజరై హనుమాండ్ల మధుకర్‌ను నగదు పురస్కారంతో సన్మానించారు. హనుమాండ్ల మధుకర్ మాట్లాడుతూ మరింత ఉత్సాహంతో జానపద కళాకారులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలియజేస్తూ అలాగే సంఘాన్ని రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల కళాకారులను ముందుకు నడిపిస్తున్న రాష్ట్ర అధ్యక్షులు వంగ శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంచు లింగయ్య, యువకళావాహిని లంక లక్ష్మి నారాయణ, మహిళ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు విజయశ్రీ, ప్రధాన కార్యదర్శి కవిత, ఎల్లవేళలా రుణపడి ఉంటానని తెలిపారు.

గాయపడిన మున్సిపల్ కార్మికుడు మృతి

నవతెలంగాణ-రామారెడ్డి

రోడ్డు ప్రమాదంలో గాయపడిన కామారెడ్డి మున్సిపల్ కార్మికుడు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం రాత్రిమృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రంగంపేట గ్రామానికి చెందిన పసుపు రేవన్ కుమార్ (25) కామారెడ్డి మున్సిపల్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం మున్సిపల్‌లో పని ముగించుకొని రంగంపేట వస్తుండగా గ్రామ శివారులో అతివేగంగా వెళ్తున్న ట్రాలీ ఆటో బైక్ను ఢీకొట్టడంతో రేవన్ కుమార్ గాయాలతో పడి ఉండడంతో , స్థానికుల సమాచారం మేరకు కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కామారెడ్డి తరలించగా, మెరుగైన చికిత్స కొరకు హైదరాబాద్ తరలించారు. అప్పటికే అతను చనిపోయాడని వైద్యులు తెలిపినట్లు మృతుడి తాత పసుపు బాలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

వాజ్‌పేయ్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-గాంధారి

దేశ మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారి వాజ్ పాయి శతజయంతి సందర్భంగా గాంధారి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో బీజేపీ నాయకులు మాజీ మంత్రి నేరళ్ళ అంజనేయులు పండ్లు పంపిణీ చేశారు అనంతరం వాజ్ పాయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు నేరళ్ల ఆంజనేయులు, మండల పార్టీ అధ్యక్షులు మధుసూదన్ రావు , ఎస్టీ మోర్చా రాష్ట్ర నాయకులు మోజీరం నాయక్, నాయకులు చిమల్వర్ సాయిబాబా , శ్రీకాంత్ గౌడ్, మచ్చర్ల శ్రీకాంత్ సంజీవులు బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని వాజ్ పేయ్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలో బుధవారం మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి వేడుకలను నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు మద్రి రాంరెడ్డి,రవీందర్ రావు,విఠల్,ఈశ్వర్,గడ్డం ప్రసాద్,పూర్ణచందర్,తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట మండల కేంద్రంల పాటు ఆయా గ్రామాలలో క్రిస్మస్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో చర్చిలకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చిలో గత రెండు రోజుల నుండి నూతన అలంకారాలతో మెరిసిపోతున్నాయి.

ప్రజా పరిపాలనలో అందరికీ ఒకే న్యాయం

నవతెలంగాణ-రామారెడ్డి

ప్రజా పరిపాలనలో ప్రజలందరికీ ఒకే న్యాయం ఉంటుందని, అందులో భాగంగానే సినీ హీరో అల్లు అర్జున్ పై కేసు నమోదు అయిందని ప్రతిపక్షాలు గమనించాలని జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. ప్రతిపక్షాలకు డబ్బున్న సంపన్నులే ముఖ్యమా, ప్రజల సమస్యలతో సంబంధం లేదా అని ప్రశ్నించారు. పేద తల్లి చనిపోయి, కుమారుడు ఆసుపత్రిలో మృతువుతో పోరాడుతుంటే, మానవత్వం చూపించవలసిన ప్రతిపక్షాలు, ఆరోపణలు ఎదుర్కొంటున్న సంపన్నుల పక్షాన కోట్లాడడం ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఇకనైనా ప్రతిపక్షాలు పేద ప్రజలపై అనవసరపు రాజకీయాలు చేయడం మానుకోవాలని, ప్రజా పాలనలో చట్టం తన పని తాను చేసుకుంటుందని, చట్టానికి ధనిక పేద వ్యత్యాసాలు ఉండవని, సినీ తారలు మానవత్వంతో ఉండాలని, ప్రజానీకం లేనిది సమాజంలో ఏదీ లేదని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధంగా సబ్బండవర్ణాలకు ఒకే న్యాయాన్ని కల్పించే ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని, అది రేవంత్ రెడ్డి తోనే సాధ్యమని పేర్కొన్నారు.

నేటి నుండి 30వ తేదీ వరకు

● నవీపేట్ ప్రధాన రైల్వే గేట్ మూసివేత

నవతెలంగాణ-నవీపేట్

అత్యవసర మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నందున నవీపేట వద్ద గల 188 నెంబర్ లెవెల్ క్రాసింగ్ రైల్వే గేటును ఐదు రోజుల పాటు మూసి ఉంచనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ బీ.శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీ ఉదయం 7.00 గంటల నుండి 30వ తేదీ సాయంత్రం 6.00 గంటల వరకు రైల్వే గేటు మూసివేయనున్నట్టు తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రయాణికులు, వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రాకపోకలు జరపాలని సూచించారు. నిజామాబాద్-బాసర మార్గంలో ప్రయాణించాల్సిన ద్విచక్ర వాహనదారులు కమలాపూర్, మహంతం, మొకనపల్లి, గుండారం మీదుగా, ఇతర వాహనదారులు కల్యాపూర్, సాటాపూర్, తడ్బిలోలి, ఫకీరాబాద్ మీదుగా రాకపోకలు సాగించాలని సూచించారు. ప్రయాణికులు ట్రాఫిక్ దారి మళ్లింపును పాటిస్తూ, తమ వంతు సహకారం అందించాలని సీనియర్ సెక్షన్ ఇంజినీర్ బీ.శ్రీనివాస్ కోరారు.

అక్రమ ఇసుక రవాణా నియంత్రణ

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలో బుధవారం తెల్లవారుజామున 2 గంటలకు ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు ఏర్పాటు చేసిన ప్రత్యేక రెవెన్యూ, పోలీసు బృందం, పెట్రోలింగ్ చేస్తుండగా అక్రమ ఇసుక లోడుతో ఉన్న టిప్పర్ పట్టుకొని కోటగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్టు తహసీల్దార్ జె.మల్లయ్య తెలిపారు. ఇట్టి టిప్పర్‌కు సయ్యద్ ఇర్షాద్ తండ్రి పాషా యజమాని అని తెలిపారు.

కాలభైరవ స్వామి దేవస్థానాన్ని దర్శించిన జగిత్యాల జడ్జి కుటుంబం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఇస్సన్నపల్లి (రామారెడ్డి)లో వెలిసిన శ్రీ కాలభైరవ స్వామి దేవస్థానాన్ని జగిత్యాల జిల్లా జడ్జి నీలిమ కుటుంబం బుధవారం దర్శించుకున్నారు. వారిని ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సిబ్బంది, పూజారులు వారికి శాలువాతో సన్మానించి, తీర్థ ప్రసాదాలతో పాటు స్వామివారి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది లక్ష్మణ్, పూజారి మణిశర్మ తదితరులు పాల్గొన్నారు.